సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో గేటు ఎదుట రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, దివాకర్‌లు మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని కోరారు. పీఆర్సీ బకాయిలు, లీవ్ ఎన్కాష్మెంట్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ ఏవో కిరణ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు అస్గర్, సీహెచ్‌వీరావు, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

పెంచికలపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెంచికలపేట మండల కేంద్రానికి చెందిన గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంతో సంబంధం లేని 117 మంది 2001 జనాభా లెక్కల ప్రకారం పెంచికపేట జనాభా జాబితాలో చేర్చారని అన్నారు. గత 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక వార్డు ఎస్టీ రిజర్వుగా వచ్చిందన్నారు. దీంతో స్థానిక ప్రజలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. భవిష్యత్‌లో జరగనున్న ఎన్నికల్లో సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు దీన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఇస్తారి, నందు, శేఖర్, హనుమంతు, కిశోర్, పురుషోత్తం, శంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు

- వివరాలు పంపించాలని అధికారులకు సర్కారు ఆదేశాలు
- తీరనున్న విద్యుత్ భారం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భవనాలపై సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డీప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్క గత శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రామ పంచాయతీ నుంచి హైదరాబాద్‌లోని సచివాలయం వరకు ఈ నిర్ణయాన్ని అమలుపర్చాలని కలెక్టర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో జిల్లా కలెక్టర్ సముదాయం, 15 మండల పరిషత్, రెవెన్యూ భవనాలు, 335 గ్రామ పంచాయతీ భవనాలు ఉన్నాయి. ఇవే కాకుండా విద్యాశాఖకు సంబంధించిన మండల వనరుల కేంద్రాలు, ఐకేపీ, ఉపాధిహామీ భవనాలు ఉన్నాయి. ప్రస్తుతం వీటన్నింటికీ జరుగుతున్న విద్యుత్ సరఫరాకు పెద్ద ఎత్తున బిల్లులు వస్తున్నాయి. ప్రభుత్వం సకాలంలో నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంలాంటి కారణాలతో బిల్లులు సకాలంలో చెల్లించక తడిసి మోపె డవుతూ అన్ని కార్యాలయాలకు భారమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం అవుతోంది. కలెక్టరేట్లు అన్ని ఒకే తరహాలో నిర్మించినందున వాటిపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు డిజైన్‌ను హైదరాబాద్ నుంచే పంపించ నున్నారు. ప్లాం ట్ల ఏర్పాటుకు కలెక్టర్లు పంపాల్సిన వివరాలకు సంబంధించి ప్రభుత్వం ఓ ప్రశ్నావళిని పంపించ బోతోంది. ఇది అందిన వారంలోగా అన్ని వివరాలను పూరించి విద్యుత్ శాఖకు పంపాలి. కలెక్టర్లు అందజేసే నివేదిక ఆధారంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

● పాఠశాలల మాదిరిగా కావొద్దు..

గత ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. తొలి విడతలో భాగంగా కొన్ని పాఠశాలల్ని ఎంపిక చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో సోలార్ ప్లాంట్ల కథ కంచికి చేరింది. ఇపుడు ప్రకటించిన పథకం పాఠశాల పథకంలా మారకూడదని ప్రజలు కోరుతు న్నారు. చిత్తశుద్ధితో అమలుకు చర్యలు తీసుకోవాలంటున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తే విద్యుత్ భారం తగ్గడమే కాకుండా ఆదా కానుంది.

● ఎల్‌టీ, హెచ్‌టీ సర్వీసులు..

తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న కార్యాలయాలకు ఎల్‌టీ సర్వీసు కింద, విద్యుత్ వినియోగం ఎక్కువగా వినియోగించే భవన సమూదాయాలకు హెచ్‌టీ సర్వీసు కింద సోలార్ ప్లాంట్లను బిగిస్తారు. ఉదాహ రణకు ఓ గ్రామ పంచాయతీ కార్యాలయానికి నెలకు రూ. 2వేల కరెంటు బిల్లు వస్తుందనుకుంటే అందుకు ఎల్‌టీ సర్వీసు కింద 3-5 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. కలెక్టరేట్ సుమదాయ భవనం, పెద్దాసుపత్రుల వంటి విశాలమైన భవనాలకు హెచ్‌టీ సర్వీసు కింద 100 కిలోవాట్లకు పైగా సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను బిగిస్తారు. జిల్లాలో 1,772 ఎల్‌టీ, 8 హెచ్‌టీ సర్వీసు లున్నట్లు అధికారులు గుర్తించారు.

నివేదికలు తయారు చేస్తున్నాం..

- వెంకటేష్ దోత్రే, జిల్లా కలెక్టర్



జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశా లల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు నివేదికలు తయారు చేస్తున్నాం. ప్లాంట్ల ఏర్పాటుకు కావాల్సిన వైశాల్యం, నెలకు విద్యుత్ వినియోగం వంటి వివరా లను సంబంధిత అధికారులు మూడు రోజుల్లోగా నివేదికలు ఇవ్వాలని ఆదేశించాం. నివేదికలు వచ్చిన వెంటనే ప్రభుత్వానికి పంపిస్తాం.

పాఠశాలను సందర్శించి.. విద్యార్థులతో కలిసి పాఠాలు విని..



పాఠాలు వింటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ఈ సందర్భంగా పదో తరగతి గదిలో గణిత ఉపాధ్యాయుడిడి త్రికోణసమితి బోధించాలని ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయుడు బోధిస్తున్న తీరును విద్యార్థులతో కలిసి కూర్చోని పాఠాలు విన్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబాట్టారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గదులు సరిపోవడం లేదని, వంట గదిని నిర్మించాలని ఎంఈవో ప్రకాష్ అ దనపు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం మండల కేంద్రం లోని ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించారు. నాణ్యతగా నిర్మించాలని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ప్రకాష్, ప్రత్యేకాధికారి వెంకట్, కార్యదర్శులు సతీష్, గణేశ్ తదితరులు ఉన్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపాలని మంగళవారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు రైల్వే జీఎం ఎస్‌కే శ్రీవాస్తవ్‌కు వినతి పత్రం అందజేశారు. నాగ్‌పూర్ నుంచి బయలు దేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కాగజ్‌నగర్‌లో హాల్టు లేక పోవటంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని అన్నారు. రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని కోరారు. సంజీవయ్య కాలనీ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం, చింతగూడ-ఈసుగాం ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన, అప్రమత్తతే ముఖ్యమన్నారు. సైబర్ నేరగాళ్లు డబ్బు దోచేస్తే 1930కు లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదు

ఆసిఫాబాద్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కాగజ్‌నగర్‌కు చెందిన హోంగార్డు రజాక్ అబ్దుల్ మంగళవారం పదవీ విరమణ పొందడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు రజాక్ అబ్దుల్‌ను సన్మానించి బహు మతి అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్, పోలీసు అధి కారులు, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నానో యూరియాతో ప్రయోజనం

బెజ్జూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): నానో యూరియాతో రైతులకు ప్రయోజనమని వ్యవసాయాధికారి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు మంగళవారం నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరియా 45 సెంటీమీటర్ల ఎత్తు పెరిగినప్పుడు ఆకులకు పిచికారీ చేసినట్లయితే మొక్క కింది వరకు దిగి బలంగా తయావుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మారుతి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని రాజ్‌కుమార్ లాడ్జిలో మంగళవారం బెజ్జూరుకు చెందిన నరేందర్(40) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నరేందర్ భార్య కొన్ని నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనతో ఉన్న రాజ్‌కుమార్‌లాడ్జిలో గది అద్దెకు తీసుకొని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. నరేందర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పనులను వేగవంతం చేయాలి

బెజ్జూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బెజ్జూరు పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా పనులను పూర్తి చేసుకుంటే ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అన్నారు. బేసిమెంట్ లెవల్ పూర్తయిన లబ్ధిదారులకు ఇప్పటికే రూ.లక్ష చొప్పున ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి వైకుంఠం తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించాలని నిరసిస్తూ మంగళవారం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 14 నెలలుగా పీఎఫ్, రెండు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే వర్కర్లకు చెల్లించలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కార్తీక్, కృష్ణమాచారి, శ్రీశైలం, మల్లేష్, గంగాధర్, మురళీ, షైమద్, రాజయ్య, గుణవంత్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించిన మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మహాధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజశేఖర్, అనీల్‌కుమార్, ప్రకాష్, సుభాష్, శ్రావణ్‌కుమార్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందన



అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్

వాంకిడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయుడిని మంగళవారం పలువురు అభినందించారు. జన్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వడ్లూరి రాజేష్‌కు మేజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ మ్యాజిక్ అండ్ యూనివర్సిటీ ఫరీదాబాద్ హరియాణా వారు గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారు. హరియాణాలో ఆగస్టు 2న నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు వడ్లూరి రాజేష్‌కు దీన్ని అందజేశారు. రాజేష్ పాఠశాల స్థాయిలో ప్రత్యేక బోధనతో చైతన్యపరచడం, క్షేత్ర పర్యటనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు తీసుకుంటున్న చర్యలతో ఆయనను ఎంపిక చేశారు.

దుండగులపై కేసు నమోదు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది నరహరిపై హత్యాయత్నం చేసిన దుండగులపై వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేసి న్యాయవాది నరహరిపై తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టిన రెబ్బెన ఎస్సైని తొలగించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు సురేష్, రజీషైదర్, సతీష్‌బాబు, రవీందర్, శ్రీనివాసరావు, రవీందర్, శైలజ, శ్రీనివాస్, గణపతి, చంద్రకుమార్, రాజీవ్‌రెడ్డి, శ్యాంకుమార్, నరహరి, విద్యాసాగర్, చరణ్‌తేజ, లాల్‌షా, రోణక్ అగర్వాల్, కళ్యాణ్, ప్రత్యూష, అనిత, గణేష్, నాగేష్, గణపతి, రాజ్‌కుమార్, అరవింద్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ రంగనాథన్‌కు ఘన నివాళి

వాంకిడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వాంకిడి శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సదానందం, సిబ్బంది అశోక్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్ష సూచన నేపథ్యంలో రానున్న మూడు రోజులు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇన్‌చార్జి మంత్రులు, అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న మూడు రోజులు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాలోట్ల ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అకస్మిక వరదలు సంభవించినపుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో ఎప్పటికపుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఐటీ సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి ఆయాశాఖల అధికారులు తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమ త్తం చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ దోత్రే జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసుశాఖ అధికారులతో జూం మీటింగ్ ద్వారా సమీక్షించారు. రాబోయే 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్ల, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణ సదుపాయం కల్పించాలి..

జిల్లాలోని వ్యవసాయ, స్వయం సహాయక సంఘాలు, ఇతర రంగాల అభివృద్ధిలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఏజీఎం చేతన్ గోరేకార్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి త్రైమాసిక కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రుణాలు అందించాలని చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీ ప్రక్రియ పూర్తి చేసి రుణాలు అందించాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో శిక్షణ పూర్తి చేసిన ప్రతీ ఒక్కరికి రుణాలు అందజేయాలని చెప్పారు. చిన్నచిన్న కారణాలతో దరఖాస్తులను తిరస్కరించకూడదని సూచించారు. అభ్యర్థులకు సమా చారం అందించి అవసరమైన పత్రాలను తీసుకొని రుణ మంజూరీ జరిగేలా చూడాలని తెలిపారు. సమావేశంలో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ రాజేశ్వర్‌జోషి, డీఆర్‌డీవో దత్తారావు, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా తిరంగా జెండా ఎగరాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా తిరంగ జెండా ఎగరాలని హర్ ఘర్ తిరంగా కార్యక్రమ జిల్లా కన్వీన్ కోవ విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో మంగళవారం పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో కలసి తిరంగా జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత దేశ ప్రభుత్వం సాధించిన విజయాలను సైనిక సామర్థ్యాలను అభినందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పహల్‌గాం దాడి తరువాత ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన ఉగ్రవాదుల ఏరివేతకు భారత ప్రభుత్వం ఉగ్రవాదులను తిప్పి కొట్టిందన్నారు. భారత సైన్యానిన్న అభినందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశ సేవ కోసం ఎంతో పాటు పడుతున్న వారందరిని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఇందులో భాగంగా ప్రతి ఇంటిలో జాతీయ జెండాను ఎగుర వేసి జాతీయతను చాటాలని కోవ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు.



జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, సుచిత్, మల్లికార్జున్‌యాదవ్, వీరభద్రచారి, అరుణ్‌లోయ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర ప్రాంతాలకు విద్యార్థుల తరలింపు

శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



పిల్లలను ఇతర గురుకులాలకు తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు

సిర్పూర్(టి), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో సంబంధిత శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో చదువుతున్న 497మంది విద్యార్థులను మంగళవారం పలు గురుకులాలకు తరలింపు చేపట్టారు. 5,6, 7 తరగతుల విద్యార్థులను ఆసిఫాబాద్ గురుకులంకు, 8వ తరగతి విద్యార్థులను జైపూర్, 9, 10 తరగతుల విద్యార్థు లను బెల్లంపల్లి గురుకుల పాఠశాలలకు, కళాశాల మొదటి సంవత్సరం చదువుతున్న సీఈసీ విద్యార్థులను కాసిపేట గురుకులంకు, ఎంఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులను కోరుట్లకు తరలించారు. ఈ మేరకు విద్యార్థుల తల్లితండ్రులను పిలిపించి వారి అభిప్రాయం మేరకే చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి కుప్పలే అవకాశం ఉందని ఇంజనీరింగ్ అధికారులు విచారణ జరిపి నిర్ధారణకు వచ్చిన తరుణంలోనే గురుకులాల రాష్ట్ర సెక్రెటరీ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా ఇదే స్థలంలో రూ.12 కోట్లతో నూతన భవనం మంజూరుకు ప్రతిపాదనలు పంపించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన పీహెచ్‌సీ జూనియర్ అసిస్టెంట్

రూ. 6 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


ఏసీబీకి చిక్కిన జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్

నస్పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గడియారం శ్రీనివాసులు మంగళవారం పదవి ఉద్యోగ విరమణ పొందిన వ్యక్తి నుంచి రూ. 6వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం మధ్యాహ్నం బాధితుడి నుంచి శ్రీనివాసులు లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా డీఎస్పీ మధు దాడికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించారు. చెన్నూరు మండలం అంగ్రాజుపల్లి ఆరోగ్య కేంద్రంలో శ్రీనివాసులు రెగ్యూలర్ పోస్టు కాగా కోటపల్లి ఆరోగ్యం కేంద్రంలో ఇన్‌చార్జి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండు డీఏ బకాయి బిల్లులను తయారు చేసి డీడీవోకు పంపించేందుకు శ్రీనివాసులు రూ. 6వేలు డిమాండ్ చేశాడు. లంచం ఇచ్చుకోలేని బాధితుడు చేసేది లేక ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచనల మేరకు బాధితుడు డబ్బులు తీసుకెళ్లి శ్రీనివాసు లుకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును విచారించిన అనంతరం అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరు పర్చినట్లు డీఎస్పీ మధు తెలిపారు.

40 రోజుల్లో ఇద్దరు అధికారుల పట్టివేత

కోటపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు మరో అవినీతి చేప చిక్కింది. గడిచిన 40 రోజుల్లోనే మండలానికి చెందిన ఇద్దరు అధికారులు ఏసీబీ వలలో పట్టుబడ్డారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి ఎల్‌డీసీగా పనిచేస్తున్న గడియారం శ్రీనివాస్ మంగళవారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వోగా పనిచేసి గత సంవత్సరం ఉద్యోగ విరమణ పొందిన తోట వెంకటేశ్వర్‌కు సంబంధించి డీఏ బకాయి బిల్లులను తయారు చేసి డీడీవోకు పంపించేందరుకు ఆయన వద్ద నుంచి రూ. 6 వేల లంచం డిమాండ్ చేయడంతో మంగళవారం బాధితుడు సదరు అధికారికి మంచిర్యాలలోని సమీకృత కలెక్టర్ కార్యాలయం ఆవరణ సమీపంలోని ఓ హోటల్ వద్ద లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జులై 4వ తేదీన ఓ రైతు వద్ద నుంచి రూ. 10 వేల లంచం తీసుకుంటూ డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ ఏసీబీ వలలో చిక్కాడు. గడిచిన 40 రోజుల్లో ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కడంతో కార్యాలయాల్లో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందనేది తేటతెల్లం అవుతుందనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ప్రతి కార్యాలయంలో పైసలు ఇస్తే కానీ ఫైల్ కదలడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే తమకు సమాచారం అందించాలని ఏసీబీ అధికారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం చున్నంబట్టి వాడ సమీపంలోఈనెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయికుంటకు చెందిన రాంటెంకి రాజవ్వ(84) మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజవ్వ చున్నంబట్టి వాడ సమీపంలో రోడ్డు దాటుతుండగా మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్‌వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రాజవ్వ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. రాజవ్వ కూతురు మల్లక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

కురిసేదెంత.. నిలిచేదెంత..



- వర్షపాతం నమోదులో లోపించిన శాస్త్రీయత
- అరకొరగా వాతావరణ కేంద్రాలు
- బీమాపై ప్రభావం చూపుతున్న నివేదికలు

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వర్షపాతాన్ని అంచనా వేయడంలో నమోదు ప్రక్రియ కీలకం. కరువును అంచనా వేయడం, అతివృష్టి అనావృష్టి తీవ్రతను తెలియజేప్పడంలో రోజు వారి నమోదు ప్రక్రియలే ప్రధానం. ఏ మాత్రం తప్పు చేసిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే సాయంలో కోత పడే అవకాశం ఉంది. ఆయా మండలాలలో కురిసే వరపాతం నమోదు కోసం కాలం చెల్లిన రెయిన్ గేజ్‌లపైనే అధికారులు ఆధారపడుతున్నారు. వర్షపాతం నమోదు పర్యవేక్షించాల్సిన సహాయ గణాంక అధికారుల నిర్లక్ష్యం కారణంగా చినుకుల లెక్కల్లో శాస్త్రీయత కొరవడుతున్నది. ఇంకా పురాతన పద్ధతుల్లోనే గణాంకాలు నమోదు చేయడం వల్ల నవేదికలు తప్పుల తడకగా తయారయ్యాయి.

జిల్లాలోని అన్ని మండలాల్లో తహసీ ల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌ల ద్వారా వర్షపాతం నమోదు చేస్తున్నప్పటికీ ఇవి పెద్దగా సత్ఫలితాలు ఇవ్వడం లేదనే చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 15 మండలాలు ఉండగా కేవలం 12 మండలాల్లోనే రెయిన్ గేజ్‌లు ఉన్నాయి. వీటి నిర్వహణను తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీఎస్డీపీఎస్) చూస్తున్నది.

చినుకుల లెక్కల్లో..

వర్షపు చినుకుల లెక్కల్లో శాస్త్రీ యత కొరవడుతోంది. రెయిన్‌గేజ్ అనేది వర్షపాతం మొత్తాన్ని కొలవడానికి ఉపయోగించే పరికరం. దీనిని ఉడోమీటర్, ఓంబ్రో మిటీర్, లేదా ప్లూవియోమీటర్ అని కూడా పిలుస్తారు.

రియన్ గేజ్‌లో రెండు రకాలు ఉంటాయి. మొదటిది స్టాండర్డ్ రెయిన్ గేజ్. ఇది సాధారణంగా ఉపయోగిం చే రెయిన్ గేజ్. ఇది ఒక గిరాటు మరియు కొలతలతో కూడిన గ్లాస్ ట్యూబ్ కలిగి ఉంటుంది. ఇందులో ఒక బకెట్ ఉంటుంది. అది వర్షం పడినప్పుడు ఒక నిర్దిష్ట పరిమాణంలో నీటిని సేకరించి, అది నిండిన తరువత తిరుగుతుంది. ఆ విధంగా ఎన్ని సార్లు తిరిగింది అనే దాని ఆధారంగా వర్షపాతం లెక్కిస్తారు. రెండోది వెయి టింగ్ రెయిన్ గేజ్. ఇది బకెట్‌లో సేకరించిన నీటి బరువును కొలుస్తుంది. బరువు పెరిగే కొద్ది వర్షపాతం పెరుగుతుందని లెక్కిస్తారు. కానీ పురాతన పద్ధతు ల్లోనే వర్షపాతాన్ని లెక్క కట్టం వల్ల నివేదికలు తప్పుల తడకగా మారి తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇప్పటి వరకు..

ఇప్పటి వరకు అనుసరిస్తున్న విధానం ప్రకారం ఒక వర్షపు రోజు నుంచి మరొక వర్షపు రోజుకు మధ్య 15 రోజుల వ్యత్యాసం ఉంటేనే ఈ ప్రాంతంలో కరువు ప్రభావం ఉన్నట్లుగా అధికారులు పరిగణిస్తారు. అంటే 25 మిల్లీమీటర్ల పైన కురిసన వర్షాపాతాన్ని ఒక రోజుగా గుర్తిస్తారు. ఇంతగా ప్రాధాన్యత గల వర్షా తం నమోదుపైన అధికారుల నిర్లక్ష్యంపైన సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. అసలు వర్షాపాతం అంచనాలే తలకిందులు కావడంతో కరువు ప్రాంతాల ఎంపిక ప్రక్రియ కూడా అశాస్త్రీయంగా ఉండడం వల్ల ప్రభుత్వ సాయం కూడా కరువవుతన్నది.

మండల కేంద్రాలకే పరిమితం..

జిల్లాలో ఒక్కో మండలం సుమారు 20 నుంచి 30 కిలో మీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. కేవలం మండల కేంద్రాలలోనే వర్షపాత సూచికలు ఏర్పాటు చేయడం వల్ల గ్రామాల్లో కురిసిన వర్షం లెక్కలోకి రావడం లేదు. అలాగే వీటి నిర్వహణ లెక్కింపు బాధ్యత మండల గణాంక అధికారులకు ఇవ్వడం కొన్ని మండలాలకు అధికారులు అందుబాటులో లేక పోవడం తహసీల్దార్ కార్యాలయాల్లోనే పని చేసే కింది స్థాయి సిబ్బందే వర్షాపాతన్ని లెక్క కడుతున్నారు.

క్షేత్రస్థాయి అధికారుల లెక్కలతోనే ఉన్నత స్థాయి అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పంటల బీమాపథకాల్లో ప్రీమియం చెల్లిస్తున్న రైతులకు పంట నష్టాన్ని అందించే అవకాశం ఉంటుంది. పలు బీమా కంపెనీలు వాతావరణ స్టేషన్ల ఆధారంగానే బీమా చెల్లింపులు చేసేందుకు ఆస్తి చూపుతున్నాయి. అవి అందించే వివరాలను, రెవెన్యూ అధికారులు సేకరించి సమాచారాన్ని ఎలాంటి పొంతన లేకుండా పోతుంది.

చేయాల్సిన మార్పులు..

రైతులకు సరైన న్యాయం జరిగి, సరైన వర్షపాతం నమోదు కావాలంటే మార్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాత వాటి స్థానంలో ఆటోమేటిక్ యంత్రాలను ఏర్పాటు చేసి వీటిల్లో చిప్ ఏర్పాటు చేయడం వల్ల వర్షాపాతం, వాయువేగం, ఎండ తదితర వివరాలతో కూడిన వాతావరణ నివేదికను అధికారులకు ప్రతి గంటకు ఒక సారి తెలిసే పరికాన్ని ఏర్పాటు చేయాలి. ఇదే సందర్భంలో ఈ నివేదిక ప్రణాళిక సంస్థ ప్రధాన సర్వర్‌కు అనుసంధానించడం వల్ల వర్షపాతం నమోదులో సరైన నివేదికలు వచ్చి రైతులకు న్యాయం కలిగే అవకాశం ఉంటుంది.

నిందితుల అరెస్టు

మంచిర్యాలక్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం బైపాస్ రోడ్డులో నలుగురి గంజాయి నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సమాచారం మేరకు బైపాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మంచిర్యాలకు చెందిన శెట్టి రణదీర్, ఐత పవన్‌కళ్యాన్, ఆవునూరి సన్ని, ఊరెల్లి సాయికుమార్‌లను అదుపులోకి తీసుకొని వారి వద్ద 500 గ్రాముల గం జాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. బాబీ అనే యువకుడు పరారీలో ఉన్నాడని వీరిపి పై కేసు నమోదు నలుగురిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఓడాబా సమీపంలో తనిఖీల్లో భాగంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతుండగా కైరిగాం గ్రామానికి చెందిన గన్నా శ్రావణ్ కుమార్, రాజురాకు చెందిన అరుణ్ రామారావుకుమార్‌లు అనుమానాస్పదంగా కనబడడంతో వీరి వద్ద తనిఖీ చేయగా 60 గ్రాముల గంజాయి(10 ప్యాకేట్లు) లభించినట్లు తెలిపారు. ఈ మేరకు గంజాయిని స్వాధీన పర్చుకుని ఇద్దరి నిందితులను ఆసిఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. యువత గంజాయి బారిన పడొద్దని సూచించారు. జిలాల్లో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లయితే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు సంజీవ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల్లో మహిళలను చేర్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హత గల ప్రతీ మహిళలను స్వయం సహాయక సంఘాలలో చేర్పించాలి కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల వీవోలు, ఏపీవోలు కమ్యూనిటీ సమన్వయకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద అనే వ్యాపారాలు నిర్వహిం చేందుకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. క్యాంటీన్‌లు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, ఇతర ఎంటర్‌ప్రైజేస్‌ల నిర్వహణకు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తే కుటుంబానికి మేలు కలుగుతుందని, అర్హత కలిగిన ప్రతి మహిళను స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్పించే విధంగా ఏపీఎంలు, సీసీలు కృషి చేయాలన్నారు. సంఘంలో సభ్యులుగా చేరితే కలిగే ప్రయోజనాలపై మహిళలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ నెల చివరిలోగా ప్రతి మహిళ సంఘంలో సభ్యులుగా ఉండేలా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. సమా వేశంలో ప్రాజెక్టు మేనేజర్ యాదగిరి, శేషరావు, యశోద, నరేందర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల, గౌరవ అధ్య క్షురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠ శాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం అడ గ్రామ పంచాయతీ పరిధిలోని వాడిగూడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంట శాల, రిజిస్టర్‌లు, పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించి ఉపాధ్యా యులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపతం చేసి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు.. పాఠశాల పరిసరాలను పరిశు భ్రంగా ఉంచాలని తెలిపారు. ఆయన వెంట విద్యాధికారి ఉదయ్ బాబు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఆర్‌పీ-1లో ప్రమాదం

ఇద్దరు కార్మికులకు గాయాలు

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్‌ఆర్‌పీ-1 గనిలో ప్రమాదం జరిగి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. గని కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.... మొదటి షిఫ్ట్‌లో 5వ సీమ్ టన్నెల్‌లో మల్వ తోడే పనుల్లో కార్మికులు ఉండగా, బండ పడడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న కారుణ్య, దేవీసింగ్ గాయపడ్డారు. కారుణ్య కాలుకు ఫ్యాక్చర్ అయ్యింది. దేవీసింగ్ గాయాలపా లయ్యాడు. కారుణ్య అనే కార్మికుడు వీటీసీలో శిక్షణ పూర్తికాగా, అండర్ గ్రౌండ్‌లో మరో రెండు రోజుల్లో పూర్తి చేసుకోనున్నాడు. ఈ క్రమంలో ప్రమాదం జరిగింది.

మేనేజర్ బాధ్యత వహించాలి

ఎస్‌ఆర్‌పీ 1 గని ప్రమాదంపై మేనేజర్ బాధ్యతవహించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరో పించారు. మంగళవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికుల్లో కారుణ్య ఇంకా శిక్షణలో ఉన్నాడ న్నారు. నిబంధనలు అతిక్రమించి అతడితో పూర్తి స్థాయిలో పనులు చేయంచడం వల్ల ప్రమాదంబారిన పడ్డాడని తెలిపారు.

డైరెక్టర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఏరియా వర్క్‌షాపులో ఈ నెల 31వ తేదీన రిటైర్ కానున్న డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణను శ్రీరాంపూర్ జీఎం ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీ యూనీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం (వర్క్‌షాప్) రవీందర్, ఎస్‌ఈ (సీహెచ్‌పీ) చంద్రలింగం, డిప్యూటీ ఎస్‌ఈలు సారయ్య, మధుకర్, సీనియర్ పీవో సంతన్, పిట్ కార్యదర్శి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు సరికాదు'

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌వి అర్థం లేని ఆరోపణలు సరికాదని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సారయ్యఏరియా ఉపాధ్య క్షు డు అనిల్‌రెడ్డి అన్నారు. యూనియన్ కార్యాలయంలో మగళవారం మాట్లాడుతూ ఆయన ఆరోపణలు మానుకోవాలని సూచించారు.

కార్మికుల హక్కుల సాధనకు పోరాటం


కేకే ఓసీ గనిపై కేఎల్ మహేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసిన ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల సాధనే ఏకైక లక్ష్యంగా పోరాటం చేసిన కార్మిక నాయకుడు కేఎల్ మహేంద్ర అని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని అన్ని గనుల, డిపార్ట్‌మెంట్ల వద్ద దివంగత ఏఐటీయుసీ జాతీయ నాయకులు కెఎల్ మహేంద్ర వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ముందుగా ఆయన చిత్రప టానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసంద ర్భంగా కేకే5, వర్కుషా పులో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు.. దివం గత నేత కేఎల్ మహేంద్ర ఆశయ సాధనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలి పారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి భీమ నాథుని సుదర్శన్, ఏరియా నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, సివి రమణ, ఎగ్గెటి రాజేశ్వర్‌రావు, భానయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు కేఎల్ మహేంద్ర చిరస్మరణీయుడని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మహేంద్ర వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేఎల్ మహేంద్ర స్ఫూర్తితో కార్మికుల హక్కుల సాధనకు పోరాడుతామవని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్, నాయకులు బంగారి రాజయ్య, టి. శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రతాప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): కాసిపేట 1, 2గనులపై కేఎల్ మహేంద్ర వర్ధంతి వేడు కలను కార్మిక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఐటీయుసీ బెల్లంపల్లి బ్రాంచి దాగాం మల్లేశ్ , కాసిపేట 1వ గని ఫిట్ సెక్రటరీ నీలుగు లక్ష్మీనారాయణ, 2వ గని ఫిట్ సెక్రటరీ బొల్లే శ్రీనివాస్, కార్మిక సంఘాల నాయకులు ఎస్. నాగేశ్వర్ రావు, పర్వతి సురేశ్, చొప్పరి శ్రీహరి, కొక్కెర సంతోష్, సెగ్యం శంకరయ్య, కొండపల్లి నర్సయ్య, బొజ్జుల వెంకటేశ్, కొత్తపల్లి క్రిష్ణచారి, రాజుకుమార్ పాల్గొన్నారు.

హామీల అమలుపై పట్టింపు కరువు


మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి గెలిచిన ఏఐటీయూసీ అమలును పట్టించుకోవడం లేదని హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి అన్నారు. హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రతిపక్ష యూనియన్ ఐఎన్‌టీయూసీ రెండు రెండేనని కార్మికులకు ఆ సంఘం ఒరగబెట్టింది శూన్యమని చెప్పారు. గుర్తింపు సంఘం ఈ హామీల గురించి గేటు మీటింగ్‌లో మాట్లాడడం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కార్మికులను అయోమయానికి గురి చేయడమే అవుతుందన్నారు. ఐఎన్‌టీయూసీ కొత్త గనుల కోసం సొంతింటి కలతో పాటు పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రద్దు చేయాలని, ఇతర డిమాండ్లతో ఆందోళనలు చేయడం అర్థరహితమని తెలిపారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్ నాయకులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, థామస్, రామస్వామి పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు లాభాల వాటా వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు అన్నారు. ఎస్‌ఆర్‌పీ 3, ఆర్‌కే 5 గనుల్లో మంగళవారం మేనేజర్లకు వినతిపత్రాలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగిసి 5 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రకటన చేయలేదన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి కార్మికులకు 35 శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు చిగురు లక్ష్మణ్, వెంగళ శ్రీనివాస్, బ్రాంచ్ నాయ కులు సాయిల్ల శ్రీనివాస్, మిడివెల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సమాచారం

ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలి


మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఆర్‌కే 7 గనిపై మంగళవారం నిర్వహించిన మల్టి డిపార్ట్‌మెంటల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణివ్యాప్తం గా ఆర్‌కే 7 గని చాలా అంశాల్లో మొదటిస్థానంలో ఉందని, ఇలాగే ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం(ఈ అండ్ ఎం) రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రక్షణకు పోరాడాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థను రక్షించుకునేందుకు అందరు సమష్టిగా పోరాడాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య అన్నారు. బెల్లంపల్లి రీజినల్ కార్యదర్శి సమ్ము రాజయ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చా లని, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రద్దు చేయాలని, బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, నాయకులు దాసరి జనార్దన్, చంద్రశేఖర్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

14న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చేస్తున్న ఆందోళనల్లో భాగంగా ఈ నెల 14న అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ, మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులు, తదితర సమస్యలను పరిష్కరించేందుకు తాము ఈ నెల 7న అన్ని ఏరియాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపామన్నారు. ఈ నెల 14న మరోమారు జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు చేసి, వినతిపత్రాలు అందిసామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కానిపక్షంలో 21వ తేదీన కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. 2014 నుంచి ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని జనక్ ప్రసా ద్ అన్నారు. ఎన్నికల సంఘం, బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆయన ఆరోపించారు. . మోదీని గద్దె దించడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని తెలిపారు. సమావేశంలో కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్ రావు, ప్రధాన కార్యదర్శులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్ జోయల్, కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి: ప్రభుత్వ భూముల పర్యవేక్షణకు కృషి చేయాలని కోరుతూ మంగళవారం సీపీఐ నాయకులు ఆర్డీవో కార్యాలయంలో సబ్‌కలెక్టర్‌తో మాట్లాడారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. నాయకులు రాజమౌళి, బొంతల లక్ష్మీనారాయణ, రాజేశ్, తిలక్ అంబేద్కర్, రత్నం రాజం, మహేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

నస్పూర్ : రోడ్లపై ప్రయాణించే సమయంలో వాహనాలకు అన్ని రకాల అనుమతి పత్రాలు కలిగి ఉండాలని, సురక్షిత ప్రయాణమే ముఖ్యమని సీసీసీ నస్పూర్ ఎస్సై ఉపేందర్ రావు అన్నారు. సీసీసీ కార్నర్ వద్ద వాహనాల తనిఖీని చేపట్టారు.

నెన్నెల : కొత్తూరు గ్రామానికి చెందిన ఎండీ జలీల్‌పై అదే గ్రామానికి చెందిన బోయిని రాజు, కొడిపె మహేందర్ మంగళవారం దాడి చేశారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

భీమిని: ప్రతీ ఒక ఆటో డ్రైవర్ తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని ఎస్సై విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆటో డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.

వేమనపల్లి : వేమనపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్, బీజేవైఎం నాయకులను మంగళవారం నీల్వాయి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. హిందూ సంఘాల పిలుపు మేరకు హైద్రాబాద్‌లోని పెద్దమ్మ గుడి దగ్గర కుంకుమార్చన కార్యక్రమానికి వెళ్తున్నారనే సమాచారంతో నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ ఉపాధ్యక్షుడు మధునయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఉన్నారు.

కోటపల్లి : మండలంలోని రాపన్‌పల్లి అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు వాహన సోదాలు నిర్వహిం చారు. రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్ఐ రాజేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వానా కాలం పొంచి ఉన్న ప్రమాదాలు

పిడుగుల వేళ...

రైతులు, రైతు కూలీలు వర్షాకాలంలో పొలం పనులు చేసే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు కూలీలు చెట్లకిందకు లేదా తాత్కాలిక షెడ్ల కిందకు పరుగెడుతారు. ఆ స్థలాల్లో పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉం టుంది. కాబట్టి రైతులు, రైతు కూలీలు ఎత్తైన ప్రదే శాల్లోకి పరుగెత్తాలి. ఇనుప వస్తువులు, వ్యవసాయ పనిముట్లు దగ్గరగా ఉంచుకోరాదు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో రైతులు ఒక వేళ మైదాన ప్రాంతంలో ఉంటే తలను మోకాళ్ల మధ్యపెట్టుకొని కూర్చుకోవడం వల్ల పిడుగుల భారినుంచి మనల్నీమనం కాపాడుకోవచ్చు.

● అప్రమత్తతే అన్నదాతలకు శ్రీరామరక్ష ● ఆద మరిస్తే ప్రాణాపాయం

కాసిపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజిబిజీగా గడుపుతున్నారు. అయితే ఈ క్రమంలో రైతులు, వ్యవసాయ కూలీలు ఏమరు పాటుగా వ్యవహరిస్తే ప్రాణాలకే ప్రమాదం వాటిలొచ్చు. రైతులు, కూలీలు అప్రమత్తతోనే విలువైన ప్రాణాలను కాపాడుకోవాలి. ఏ మాత్రం ఆద మరిచినా అంతేమరీ...

వాగులు, కాల్వల వద్ద...

అన్నదాతలు పంటపొలాల్లోకి వెళ్లేందుకు వాగులు, వంకలు దాటాల్సి వస్తోంది. వాగు లోతులను అంచనా వేయడంలో రైతులు తడబడితే ప్రమాదాల భారినపడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎగువన కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తాయి. ఆకస్మాత్తుగా వాగులు, కాల్వలు దాటే ప్రయత్నంలో నీటి ఉధృతిపెరిగి వాగులో కొట్టుకు పోయే ప్రమాదం ఉంటుంది. ఎడ్లబండ్ల సాయంతో సైతం వాగులు దాటేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలి. వాగులు, కాల్వల లోతులను అంచనా వేసుకున్న తరువాతనే వాగులు దాటాలి.

స్టార్టర్లతో జాగ్రత్త...

రైతులు పంట పొలాల్లో నీటిని పారించేందుకు మోటార్ల వద్ద వాగుల వద్ద స్టార్టర్లను ఏర్పాటు చేసు కుంటారు. వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలతో పాటు స్టార్టర్లలో పాములు దాగుంటాయి. మనకు తెలియకుండానే బాక్సుల డోర్లను ఓపెన్ చేస్తే పాము కాటుకు బలవుతారు. విద్యుదాఘాతాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. సాధారణంగా పంట పొలాల్లో రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రైతులే నేరుగా విద్యుత్ ట్రాన్స్‌ఫారం వద్దకు వెళ్లి మరమ్మతులు చేపడు తుంటారు. ఇలా చేయడం ప్రమాదకరం. విద్యుత్ సర ఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలి. సిబ్బంది అందుబాటులో లేకుంటే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. సిబ్బంది వచ్చేంత వరకు వేచి ఉండాలి. కానీ రైతులే నేరుగా స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తే ప్రమాదం కొనితెచ్చు కున్నట్లే. కాబట్టి ఎవరు కూడ సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేపట్టరాదు. పొలాల్లో ఇనుప స్తంభాలు ఉంటే రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలి.

మొక్కల మాటున ప్రాణాలు తీసే జీవులు...

జిల్లాలో పత్తిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరి గింది. వానలు విస్తారంగా కురియడంతో పత్తితో పాటే కలుపు మొక్కలు పెరుగుతున్నాయి. వ్యవసాయ కూలీలు పనులను తొందరగా ముగించుకొని ఇండ్లకు వెళ్లాలన్న హడావిడిలో ఉండి విష పురుగులను గమనించక పోవచ్చు. కానీ మొక్కల మొదల్లమాటున పాములు, తేళ్ల, విష పురుగులు మాటు వేసి ఉంటాయి. విష పురుగుల కాటుకు కూలీలు మృత్యువాతకు గురయ్యే అవకాశం ఉంది. కాబట్టి అప్రమత్తతోనే పనులను చేసుకోవాలి.



ప్రమాదాల నివారణకు పొలంబాట నిర్వహించాం...: బానోతు రాజన్న, డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్స్ బెల్లంపల్లి



రైతులు విద్యుత్ ప్రమాదాల భారినపడకుండా ఉం డేందుకు ఇటీవల పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహిం చాం. వ్యవసాయ పొలాల్లో వంగిన స్తంభాలు, వేలాడు తున్న కరెంటు వైర్లు ఉంటే సమీప విద్యుత్ సిబ్బంది కి గాను 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ ప్రమాదాల నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బందితో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రైతులకు విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు సొంతంగా మరమ్మతులు చేపట్టరాదు. సమస్యలు ఉంటే స్థానిక సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



తాండూర్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్ఐ

తాండూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తాండూర్ సీఐ దేవయ్య తెలిపారు. మంగళవారం తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. అనంతరం జాతీయ రహదారిపై సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల వివరాలను సేకరించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అధిక వేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు. అనంతరం నెంబరు ప్లేట్ సరిగ్గా లేని వాహనాలకు బ్లాక్ స్టిక్కర్లు, హెల్మెట్ లేని వారికి, రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

చర్మ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

జైపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చర్మ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జైపూర్ మెడికల్ ఆఫీసర్ ముస్తాఫా పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మంచిర్యాల పట్టణానికి చెందిన చర్మవ్యాధి నిపుణులు డా క్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనారోగ్య సమస్యలు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వంటి చర్మవ్యాధులతో బాధపడుతున్న విద్యార్థినులకు చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, వైద్యులు అశోక్, కేజీబీవీ ఎస్‌వో ఫణిబాల, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిషోర బాలికలు, వృద్ధులతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలి

నెన్నెల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కిషోరబాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్థిక తోడ్పాటు అందిచేందుకు నూతన స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని ఏపీఎం త్రయంబకేశ్వర్ కోరారు. మండల పరిషత్తు కార్యాలయంలో నూతన సంఘాల ఏర్పాటుపై సిబ్బందికి మంగళవారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. 15 నుంచి 18 ఏళ్ల నిండిన బాలికలు, 60 ఏళ్ల పైబడిన వృద్ధులను సంఘాల్లో చేర్చుకోవాలన్నారు. ఓటరు లిస్టు, పించను జాబితా ఆధారంగా వృద్ధులు, దివ్యాంగులు, అంగన్‌వాడీ సెంటర్ నుంచి కిషోర బాలికల వివరాలు సేకరించాలని చెప్పారు. ఈ నెల 30 లోగా నూతన సంఘాల ఏర్పాటు కార్యక్రమం పూర్తి చేయాలని సూచించారు. సీసీలు శ్రీనివాస్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీఈవో

కాసిపేట, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారి యాదయ్య మంగళవారం మండలంలోని లంబడితండ ప్రాథమిక పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఏకరూప దుస్తులు మెను ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

బెల్లంపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూడిదగడ్డ బస్తీలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాన్ని జేసీబీ సాయంతో కూల్చివేశారు. బూడి దగడ్డ బస్తీలో గణేష్ నవ రాత్రుల కోసం బస్తీ వాసులు శాశ్వత నిర్మాణ మండపాన్ని చేస్తుండడంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. బస్తీవాసులు వినాయకుడి కోసం నిర్మిస్తున్న మండపాన్ని కూల్చి వేయవద్దని అడ్డుకున్నారు. పోలీసుల సాయంతో రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని తొలగించారు. తహసీల్దార్ క్రిష్ణ, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.

అధికారుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు బొగ్గు ఉత్పత్తి సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న అధికారుల పెండింగ్‌లో ఉన్నసమస్యలను పరిష్కరించాలని అధికారుల సంఘం మందమర్రి ఏరియా అధ్యక్షుడు రమేష్ తెలిపారు. మంగళవారం పీఆర్‌సీ చెల్లించాలని, ఎలక్ట్రిసిటీ చార్జెస్, ఐఐటీ-ఐఐఎం, రీయింబర్స్‌మెంట్ వర్తింపు చేయాలని కోరుతూ మందమర్రి ఏరియాలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అధికారుల పదోన్నతుల విషయంలో జాప్యం జరగడం దారుణమన్నారు. సంస్థ అభివృద్ధికి పాటు పడుతున్న అధికారుల సమస్యలను పరిష్కరించాన్నారు. ఏరియాలోని కేకే 5, కేకే ఓసీపీ, జీఎం కార్యాలయం, ఏరియా స్టోర్, వర్కు షాపు, శాంతిఖని, కాసిపేట, 1, 2 గనుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏరియాజీఎం దేవేందర్, ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, పీఎం శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, శంకర్, కార్తీక్ పాల్గొన్నారు.

షాపులు తొలగించిన పోలీసు, మున్సిపల్ సిబ్బంది

శ్రీరాంపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద రోడ్డుపైకి వచ్చిన షాపులను శ్రీరాంపూర్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది సహకారంతో మంగళవారం తొలగించారు. బస్టాండులో ఉన్న షాపుల్లో అన్ని రోడ్డుపైకి రావడం, వాహనాలు పెట్టుకోవడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గతంలో రోడ్డు వెడల్పు చేసిన సందర్భంగా షాపులను వెనక్కి జరిపినప్పటికీ మళ్లీ ముందుకు పెట్టుకున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ ఆధ్వర్యంలో ముందుకు వచ్చిన షాపులను తొలగించారు. శ్రీరాంపూర్ ఎస్సైలు సంతోష్, లక్ష్మీప్రసన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

జన్నారం, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవేంద్ర కరి మల జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే ఘనంగా నిర్వహించారు. రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కళాశాల ప్రతి సంవత్సరం జిల్లాలోనే మంచి ఫలితాలు సాధి స్తుందన్నారు. డీన్ హేమలత షిండే, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌తో పాటు శ్రీనివాస్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

అధికారులు సమయ పాలన పాటించాలి

కన్నెపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగులు, అధికారులు సమయ పాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పేర్కొన్నారు. మంగళవారం కన్నెపల్లిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను, భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, డీటీ పోశయ్య, ఆర్ఐ చంద్రమౌళి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మందమర్రిరూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం 327 ఐఎన్‌టీయూసీ స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పెద్ది రమేష్ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, రవి, రజిత, సురేష్, వికాస్ పాల్గొన్నారు.

రెబ్బెన ఎస్ఐని సస్పెండ్ చేయాలి

మంచిర్యాలక్రైం,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): రెబ్బెన ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు విధులను బహిష్కరించి రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రెబ్బెన ఎస్ఐ అక్రమంగా న్యాయవాదిపై కేసును నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు జగన్, బుజంగ రావు, రంజిత్‌గౌడ్, భరత్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

బెల్లంపల్లి, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని వన్‌టౌన్ తాళ్లగురిజాల 2టౌన్ పోలీసులు మంగళవారం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. జాతీయ రహదారిపై, పట్టణంలోని ప్రధాన రహదారుల వద్ద అలాగే రైల్వే స్టేషన్ ఏరియాల్లో క్షుణ్ణంగా వాహనాలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రానున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాహనాలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, 2టౌన్ ఎస్‌హెచ్‌వో కిరణ్, సబ్ డివిజన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం : స్వాతంత్ర్య దినోత్సవం దృష్ట్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం భీమారం పోలీసులు మండల కేంద్రంలోని ఆవడం ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల వివరాలను సేకరించారు. భీమారం ఎస్ఐ శ్వేత పాల్గొన్నారు.

జైపూర్ : ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల నేపథ్యంలో మంగళవారం శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్ల ఆధ్వర్యంలో చెన్నూరు ఎక్స్‌రోడ్డు వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వ హించారు. వాహనాలను ఆపి వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. అనుమానస్పదంగా కనిపించిన వ్యక్తులు, వాహనాలను తనిఖీలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో రైల్వే స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్‌వో కిరణ్ కుమార్

కన్నెపల్లి : ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కన్నెపల్లి సబ్‌స్టేషన్ వద్ద, బస్టాండ్ ఏరియాలో కన్నెపల్లి ఎస్ఐ భాస్కర్‌రావు వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.

అటకెక్కిన మన ఊరు- మనబడి...!

(5వ పేజీ తరువాయి)

పనులు అక్కడే వదిలిపెట్టారు. అలా పెండింగులో ఉన్న నిధుల కోసం విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆ నిధులు విడుదల అయితే తప్ప.. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు పూర్తయ్యే అవకాశాలు లేవు.

ఏపీపీసీల ద్వారా పనులకు మోక్షం....

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీపీసీ (అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ) పథకానికి రూపకల్పన చేసింది. ఆ పథకం ద్వారానే ప్రస్తుతం పనులు చేపడుతోంది. అయితే ఈ పథకం ద్వారా మౌలిక వసతులైన తాగునీరు, ఫర్నీచర్, విద్యుదీకరణ, రన్నింగ్ టాయ్‌లెట్, మైనర్ రిపేర్లు మాత్రమే చేపడుతున్నారు. తద్వారా విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా కనీస సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే గత ప్రభుత్వ పథకమైన మన ఊరు-మనబడి కింద మంజూరై, పనులు ప్రారంభం కాని వాటిని కూడా ఏపీపీసీలో చేర్చడం ద్వారా సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారు. జిల్లాలో ఏపీపీసీ కింద 531 పాఠశాలలను ఎంపిక చేయగా, రూ. 19 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా, మన ఊరు-మనబడి పథకం కింద మంజూరై పనులు అర్ధాంతరంగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రహరీ, తదితర మేజర్ వర్క్సకు సంబంధించి ప్రస్తుతం పనులు ముందుకు సాగడం లేదు. ఈ పనులకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మీద వాటి భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మన ఊరు-మనబడి కింద మంజూరైన మేజర్ వర్క్స్ అసంపూర్తిగా నిలిచిపోయినందున ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజల సంక్షేమంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి మంత్రులతో కలిసి కలెక్టర్‌లు, పోలీసులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉన్నందున అధికారులందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, కంట్రోల్ 24 గంటల పాటు అందుబాటులో ఉండాలన్నారు. విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ తీగలు, వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మందులు, అంబులెన్స్‌లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు వర్షాలకు దెబ్బతినే రోడ్లను గుర్తించి వాహనాలు వెళ్లకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్, పోలీసు శాఖలు సమన్వయంతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. పోలీసుశాఖ ట్రాఫిక్ నియంత్రణ, వాగులు, నదుల వద్ద బందోబస్తు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ అధికారుతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తక్షణ సహాయం కోసం జిల్లాలోఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో విద్యుత్, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, సబ్ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో శ్రీనివాస్, పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్, సబ్ కలెక్టర్ మనోజ్

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

బెల్లంపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్ నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఉల్లిగడ్డల ఐచర్ వ్యాన్‌మంగళవారం బెల్లంపల్లిలోని జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. గోదావరిఖనికి చెందిన రమేశ్ అనే డ్రైవర్ ఐచర్ వ్యాన్‌లో ఉల్లిగడ్డలను నాగ్‌పూర్ నుంచి గోదావరిఖనికి తీసుకెళ్తున్న క్రమంలో తెల్లవారు జామున నిద్ర మత్తులో డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో ఒక్కసారిగా అదుపు తప్పి వ్యాన్ బోల్తాపడింది. ఈఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. జాతీయ రహదారి అధికారులు బోల్తాపడ్డ వ్యాన్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీసి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష

కాసిపేట, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): లారీని అతివేగంగా అజాగ్రత్తగా నడిపి 9 గొర్రెల మృతికి కారణమైన లారీ డ్రైవర్ అల్లంకి వెంకటేశంకు 75రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు బెల్లంపల్లి జెఎఫ్ సీఎం మెజిస్ట్రేట్ ముకేశ్ తెలిపారు. దీనికి సంబంధించిన దేవాపూర్ ఎస్ఐ గంగారాం వెల్లడించారు. తాండూర్ మండలం రేచినికి చెందిన మేకల కాపరి అగ్గినడిపి బీరయ్య 2021లో మేకలను తోలుకొని దేవాపూర్ వైపు వెళ్తుండగా సోమగూడెం నుంచి దేవాపూర్ వెళ్తుండగా నల్లలవాగు సమీపంలో అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో 9 గొర్రెలు చనిపోగా మిగితా 11 గొర్రెలు గాయాలపాలయ్యాయి. దీనిపై దేవాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టగా మంగళవారం బెల్లంపల్లి కోర్టులో తీర్పువెలవడిందని ఎస్ఐ గంగారాం తెలిపారు.

గుడుంబా విక్రయాలు అరికట్టాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణంలో గుడుంబా విక్రయాలు అరికట్టాలని కోరుతూ బెల్లంపల్లి ఎక్సైజ్ అధికారి సదాసేవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం వినతి పత్రం అందించారు. అధ్యక్షుడు సంగి సంతోష్ మాట్లాడుతూ పట్టణంలోని 3వ జోన్, కేకే 5 బంగ్లాస్ ఏరియా, పాలచెట్టు, ఫిల్టర్‌బెడ్ ప్రాంతాల్లో గుడుంబా విక్రయాలు జరుగుతున్నాయన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

వేమనపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్‌లను, భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాల న్నారు. వివిధ అవసరాల కోసం ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత సమయంలో ధృవీకరణ పత్రాలను అందజేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సంధ్యారాణి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

కోటపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం పాఠశాల ఏకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై సైన్స్ ఉపాధ్యాయులు లిల్లీ జోయల్, ఆమనిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మొక్కలు నాటి నీరు పోశారు. ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీలు హరీష, అనూష, సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

సంకట హర చతుర్థి పూజలు



మంచిర్యాలలో సత్యనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నస్పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మి గణపతి దేవాలయంలో మంగళవారం శ్రావణ మాస అంగారక సంకట హర చతుర్థిని పురస్కరించుకుని గణపతి హోమం, స్వామి వారికి నెయ్యి అభిషేకం ఘనంగా జరిగింది. ఆలయం చుట్టూ భక్తులు 108 ప్రదక్షిణలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు వంశీ కృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. చంద్రోదయ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు తెలిపారు.

మంచిర్యాలక్రైం: సంకష్ట సందర్భంగా మంచిర్యాల పట్టణం గోదావరి తీరంలోని రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో గణపతికి 61 జంటలతో 61 లక్షల గరకతో అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలజీ శర్మ, కమిటీ సభ్యులు వాసవి సభ్యులు అంతర్జాతీయ అడ్మినిస్ట్రేషన్ వైస్ చైర్మన్ ముక్త శ్రీనివాస్, ఆలయ ఫౌండర్ శ్రీదేవి, పుల్లూరి బాలమోహన్, కేశెట్టి వంశీక్రిష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మంచిర్యాల జిల్లా వార్తలు



బుధవారం 13 ఆగస్టు 2025

పిట్టల కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలి : సీపీఎం

నస్పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీసీసీలోని పిట్టల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎంనాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం కాలనీలో సీపీఎం నాయకులు పర్యటించి కాలనీవాసుల సమస్యలను తెలుసుకున్నారు. 15సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్నప్పటికి రోడ్లు, మురుగు కాలువలులేక నానా ఇబ్బందులు పడుతున్నరని సీపీఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, మిడివెల్లి రాజ్‌కుమార్, శోభన్, మహేష్, జంపన్న పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదువాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు కవ్వాల్ గ్రామంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల వద్దకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువాలని ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులను ఒక్కొక్కరిగా ప్రశ్నలు అడిగారు. పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మెను ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నా రు. బాలికల పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ మనోహర్ రెడ్డితో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



ప్రశంసా పత్రాలు అందిస్తున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని హైటెక్ సిటీలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జాడే ఉత్తం ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యుత్ ఉద్యోగులు దాదాపు వంద మంది పాల్గొని రక్తదానం చేశారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మాట్లాడుతూ మంచిర్యాల విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సహాయర్థం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ మహేందర్, మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, సత్యనారాయణరావు, విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సత్తిరెడ్డి, రమేష్, అధికారులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీ

జన్నారం, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో భారీ వాహనాల రాకపోకలపై అటవీశాఖ విధించిన ఆంక్షలను ఎత్తివేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడడంతో మండల కేంద్రంలో పోటాపోటీగా విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే ఆంక్షలు ఎత్తివేశారని భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా ఆ తరువాత 27 రోజులుగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరహార దీక్ష చేపట్టిన ఫలితంగానే ప్రభుత్వం ఆంక్షలు ఎత్తివేసిందని శ్రీరాముల భూమాచారితోపాటు బీజేపీ నేత బద్రీనాయక్ ఆధ్వర్యంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజా సంఘాల నాయకులు కాలినడకన భారీ ర్యాలీ నిర్వహించారు.

భీమిని మండలం మల్లిడి గ్రామంలో గేటులేని ప్రాథమిక పాఠశాల



అటకెక్కిన మన ఊరు-మన బడి..!

- పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఏర్పాటైన పథకం
- లక్ష్యం నెరవేరకుండానే నిలిచిపోయిన కార్యక్రమం
- మంచిర్యాల జిల్లాలో 246 పాఠశాలల ఎంపిక
- ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడే నిలిచిన పనులు
- జిల్లా వ్యాప్తంగా రూ. 4 కోట్ల మేర పెండింగ్
- వసతుల కల్పన కోసం ఏపీసీ స్కీం

మంచిర్యాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు-మనబడి పథకానికి శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా అత్యధికంగా విద్యార్థుల సంఖ్య ఉన్న పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం 12 రకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో ప్రహరీ గోడలు, గేట్ల ఏర్పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణం, ఫర్నీచర్, విద్యుద్దీకరణ, తాగునీటి సౌకర్యం, టాయ్‌లెట్ల నిర్మాణం, తదితర పనులు చేపట్టడం ద్వారా విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించారు. అలా ఎంపిక చేసిన పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టేందుకుగాను టెండర్లు ఆహ్వానించి పనులు అప్పగించారు. నిర్ణయించిన పనుల్లో కొంత భాగం పూర్తికాగా, మేజర్ వర్క్స్ అయిన అదనపు తరగతి గదులు, ప్రహరీల నిర్మాణ పనులు చాలా చోట్లా నిలిచిపోయాయి. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో పథకం అటకెక్కింది. సకాలంలో నిధులు రాకపోవడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, తదితర కారణాల వల్ల ఆ పనులు ముందుకు సాగలేదు. దీంతో అరకొర సౌకర్యాల నడుమ విద్యార్థులు చదువులు కొనసాగించాల్సి వస్తోంది.

జిల్లాలో రూ. 4 కోట్ల పనులు పెండింగ్...

మన ఊరు-మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో జిల్లా వ్యాప్తంగా మరో రూ. 4 కోట్ల 86 లక్షల 69వేల విలువైన పనులు చేపట్టవలసి ఉండగా, పథకం అర్థాంతరంగా రద్దయింది. పథకం కింద జిల్లాలో మొత్తం 246 పాఠశాలలను ఎంపిక చేయగా, రూ. 56 కోట్లకు పరిపాలనా అనుమతులు కూడా మంజూరయ్యాయి. ఇందులో దాదాపు రూ. 22 కోట్లతో 134 పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తికాగా, మిగిలిన సొమ్ము చెల్లించకపోవడంతో మరో 112 పాఠశాల్లో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. చేసిన పనులకు సంబంధించి బిల్లులు మంజూరు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ఎక్కడి..

మిగతా 7లో

నేడు మందమర్రిలో మంత్రి పర్యటన

మందమర్రిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రకార్మిక, ఉపాధికల్పన గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి బుధ వారం మందమర్రిలో పర్యటించనున్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. పట్టణంలోని కార్మెల్ పాఠశాలలో నూతనంగా నిర్మించిన డిగ్రీ కళాశాలను ప్రారంభించనున్నారు. నాయకులు ఏర్పాట్లు చేశారు.

మహా సభ పోస్టర్ల ఆవిష్కరణ

నస్పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్లను మంగళవారం స్థానిక నర్సయ్య భవన్‌లో నాయకులు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో ఈ నెల 20 నుంచి 22వ తేది వరకు నాల్గవ మహాసభలు జరుగనున్నాయని, సభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ కార్యదర్శి జోగుల మల్లయ్య, సహాయకార్యదర్శి లింగం రవి, నాయకులు రాజేశ్వర్‌రావు, దొడ్డిపల్లి రవీందర్, సారంగపాణి, రామన్న, జోగుల అంజనేయులు, సమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

నస్పూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కనీస వేతనాల సవరిస్తూ 2021లో విడుదల చేసిన ఐదు ప్రిలిమినరీ జీవోలను వెంటనే గెజిట్ చేయాలని, వేతనాల పెంపుదలకు సుప్రీం కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనం తరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, అసిస్టెంట్ కార్మిక శాఖ కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 73వ షెడ్యూల్ పరిశ్రమల జీవోలను గెజిట్ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, నాయకులు గోమాస ప్రకాష్, రాజేశం, మహేందర్, సమ్మయ్య, ప్రవీణ్, శ్రీశైలం, సంపత్ పాల్గొన్నారు.

కురిసేదెంత..నిలిచేదెంత

వర్షపాతం నమోదులో లోపించిన శాస్త్రీయత

6

టీబీ రహిత దేశంగా కృషి

● ఆసుపత్రి సూపరింటెండెంట్ సతీష్



మహాలక్ష్మివాడలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లక్షెట్టిపేట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో భారతదే శంను టీబీ రహిత దేశంగా చేయాలన్న దిశగా ప్రభుత్వం పని చేస్తుం దని వెంకట్రావ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట మున్సిపాటీలోని మహాలక్ష్మివాడలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. అనంతరం సుమారు 130మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు శరత్‌బాబు, శోభ, సూపర్‌వైజర్లు సురేష్, శోభ, మార్త, ఎంఎల్ హెచ్‌పీలు రజిత, స్రవంతి, హెల్త్‌అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్, ఎఎన్‌ఎంలువిజయ, సుజాతతో పాటు ఐసీటీసీ సూపర్‌వైజర్ ఆంజనేయులు ఉన్నారు.

నిర్ణీత సమయంలో మూడవ యూనిట్

ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య సిబ్బంది నిర్ణీత సమయంలో మూడవ యూనిట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ ఎం) సత్యనారాయ ణరావు పేర్కొన్నారు. మంగళవారం జైపూర్‌లోని ఎస్టీపీపీలో ఆయన పర్యటించారు. ప్రాణహిత గెస్ట్ హౌజ్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్లాంట్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంటును సందర్శించి ప్లాంటు పని తీరును, విద్యుత్ ఉత్పత్తి ఉత్పాదకత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌లో మంచి పీఎల్ఎఫ్ సాధించాలన్నారు.

ఇథనాల్ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సీఎస్ఆర్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్నపనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే ఏడాది నుంచి ప్లాంట్ పరిసరాల్లో సీబీఎస్ఈ పాఠశాలను ప్రారంభించేలా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ప్లాంట్ అభివృద్ధి కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, హెచ్‌వోడీ విశ్వనాధరాజు, జీఎం శ్రీనివాసులు, అధికారులు నర్సింహారావు, మురళీధర్, మదన్ మోహన్, శ్రీనివాస్, సముద్రాల శ్రీనివాస్, అజాజుల్లాఖాన్, కిరణ్‌బాబులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తాం

- కలెక్టర్ కుమార్ దీపక్
- కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో పోడు వ్యవసాయం చేయరాదు



లింగాపూర్ రిజర్వు ఫారెస్టులో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులకు అటవీ ప్రాంతంలో వెదురు సాగుకు అవసరమయ్యే మొక్కలు, వాటి ఖర్చులను ప్రభుత్వమే భర్తించి వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దండేపల్లి మండలం లింగాపూర్ అటవీ బీట్‌లో కొంత కాలంగా పోడు వ్యవసాయం చేస్తున్న ఆదివాసి గిరిజనులతో మంగళవారం కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, డీసీపీ భాస్కర్, అధికారులు సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడారు. గిరిజనుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం చట్టం ప్రకారం చర్యలు తీసు కుంటామన్నారు. ఆర్‌వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం 2005 కంటే ముందు నుంచి పోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన గిరిజనలకు పట్టాలు అందించి జీవధారం కల్పిస్తున్నమన్నారు. అర్హులైన గిరిజనులకు అటవీ భూముల్లో వెదురు సాగుచేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లాలో 5శాతం ఉద్యానవన పంటల సాగు జరుగుతుందని, జిల్లాలోని దేవునిపల్లిలో 150 హెక్టార్లు విస్తీర్ణంలో గిరిజనులతో మల్బరీ సాగు చేయిస్తామన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టులో అటవీ భూములను అక్రమించుకోని పోడు వ్యవసాయం చేయడం నేరమన్నారు. అలా చేసే వారిపై కఠినచర్యలు తప్పవన్నారు. దీంతో ఆదివాసి గిరిజనులు తమకు ప్రభుత్వ పథకాలు వద్దు అటవీ భూములే కావాలంటూ అధికారుల ఎదుట మొరపెట్టుకున్నారు. ఇప్పటికైన తమకు న్యాయం చేయాలని గిరిజన మహిళలు మొర పెట్టుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్, తహసీల్దార్ రోహత్ దేశ్‌పాండే, ఆర్‌ఆర్‌వో సుష్మరావు, సీఐరమణ మూర్తి, ఎస్సైలు తైసినోద్దీన్, గోపతి సురేష్, గోల్లపల్లి అనుష, డిప్యూటి ఎఫ్ ఆర్‌వోలు పోచ మల్లు, సాగరిక, అటవీ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి



కళాశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థినులు

బెల్లంపల్లి,ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనపథకాన్ని అమలు చేయాలని కోరు తూ మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లితిరుపతి మాట్లాడుతూ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేయక పోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న విధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని కళాశాలల్లో అమ లు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్‌ను విడుదలచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల గురుకులాల్లో చనిపోయిన విద్యార్థులకు ప్రభుత్వం మృతుల కుటుంబాలను పరామర్శించి అండగా ఉండాలని పేర్కొన్నారు.

అద్దె భవనాల్లో గురుకులహాస్టళ్లు కొనసాగుతున్నాయని వెంటనే ప్రభుత్వం శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని బాలుర ఎస్సీ వసతిగృహం శిథిలావస్థలో ఉందని విద్యార్థులు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, అజయ్, సందీప్‌లు పాల్గొన్నారు.

అశ్లీల వీడియోల కేసులో ఇద్దరి అరెస్టు

మందమర్రిటౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చిన్నారుల అశ్లీల వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినందుకు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు.

మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. మొబైల్ ఫోన్‌లలో చిన్నారుల అశ్లీల వీడియోలు చూసినా, ఇతరులకు పంపినా ఎవరికి తెలియదని అనుకుంటున్నారని ఇది సరైంది కాదన్నారు. ఎన్‌సీఎంఈసీ అందించిన సమాచారం ఆధారంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ ఈ కేసును మందమర్రి పోలీసులకు అప్పగించడంతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. ఇంటర్నెట్‌లో చిన్నారుల అశ్లీల వీడియోలు షేర్‌చేయడం చట్ట విరుద్ధమని, ఇలాచేసే వారిపై కేసులు నమోదవుతాయన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్ నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆపదలో అండగా పే బ్యాక్ సొసైటీ

● కార్యదర్శి శ్రావణికి ఉద్యోగుల ఉదార సహాయం



పంచాయతీ కార్యదర్శికి పండ్లు అందజేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి, సొసైటీ సభ్యులు

జైపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన టేకుమట్ల గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణి చికిత్సకోసం జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, పేబ్యాక్ సొసైటీ సభ్యులు శ్రావణి నివాసానికి వెళ్లి పరామర్శించారు. పేబ్యాక్ సొసైటీ వ్యవ స్థాపకుడు దాసరి వెంకటరమణ, జాడి రామ్‌కుమార్ మాట్లాడుతూ ఆపదలో మద్దతుగా నిలిచిన జిల్లాలోని ఉద్యోగులందరికి కృతజ్ఞతలు తెలిపారు. వేరే జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా సహాయం చేయడానికి కూడా ముందుకు వచ్చారన్నారు. మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దాసరినరేందర్, పంచాయతీ కార్యదర్శులు సుమన్, సాయి పాల్గొన్నారు.

భూ సమస్యలపై సత్వర పరిష్కారం చూపాలి



ప్రజలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

కోటపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల దృష్ట్యా కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సంద ర్శించిన ఆయన భూ భారతి గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి ఈ కేవైసీ చేసిన తర్వాత ఫైల్‌ను ప్రాసెస్ చేయాలని సూచించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న ప్రజలను ఒక్కొక్కరిగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డు గదిని పరిశీలించారు. అనంతరం స్థానిక ఎరువుల మందుల దుకాణాన్ని పరిశీలించిన ఆయన దుకాణంలోని స్టాకు నిల్వలు, ఎరువులు, పురుగు మందుల నిల్వల గురించి అమ్మకాలు గురించి తెలుసుకుని స్టాక్ రిజిష్టర్‌తో నిల్వలను పరిశీలించారు. నిల్వలను సరిగ్గా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ రాఘవేందర్‌రావు, గిర్దావర్ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.